క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఏవీ అప్పారావు రోడ్డు, మహాలక్ష్మి ఆలయం వీధులు, కాంచన నగర్, ఎస్‌బీఐ కాలనీ, వెంకటేశ్వర నగర్, వాకర్స్ పార్క్ ఎదుట వీధులు, డీవీబీరాజు స్క్వేర్ 62 ఫ్లాట్లు, విద్యుత్ కాలనీ, బర్మా కాలనీ, డీబీవీ రాజు స్క్వేర్ 72 ఫ్లాట్లు, మాజీ ఎమ్మెల్యే వీధి, వెంకటేశ్వర నగర్‌లో సరఫరా ఉండదన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ హౌసింగ్ బోర్డ్ ఫీడర్ ఏరియా అంతరాయం కలుగుతుందన్నారు.

డిక్లరేషన్‌పై చర్యలు తీసుకోవాలి

సీటీఆర్ఐ: క్రిస్టియన్ డిక్లరేషన్ వర్క్‌షాపు మెమోపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కనికరం చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ఎన్‌బీ సాల్మన్ విజ్ఞప్తి చేశారు. ఆయన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ క్రిస్టియన్లందరూ బీసీ–సీలోనే కొనసాగాలని, అందుకు భిన్నంగా ఎస్సీలో కొనసాగుతుండడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందన్న విషయాన్ని 2021లో గవర్నర్, రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తిలకు పిటీషన్లు పెట్టారన్నారు. దీంతో గవర్నర్ వాటిని పరిశీలించాలని క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్‌కు ఆదేశాలు జారీ చేశారన్నారు. కానీ ఇప్పటివరకూ ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు.

స్పందనకు 23 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పన్ను మార్పు, పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలపై ప్రజలు 23 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టేందుకు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదనపు కమిషనర్ సత్యవేణి, సిటీ ప్లానర్ వైబీఆర్ చంద్రబోస్, ఎస్ఈ జి.పాండురంగారావు పాల్గొన్నారు.

త్వరితగతిన పరిష్కరించాలి

సీటీఆర్ఐ: ప్రజలు అందజేసిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కేఆర్‌సీ తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. రేషన్ కార్డులు, తాగునీరు, భూ ఆక్రమణ, ఇళ్ల స్థలాలు, హౌసింగ్, ఉపాధి, భూ సర్వే తదితర వాటికి సంబంధించి 17 మంది అర్జీలు అందజేశారు. ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి జీఏఎల్ఎస్ దేవి, అధికారులు పాల్గొన్నారు.

ఆలయానికి ఫర్నిచర్ వితరణ



ఫర్నిచర్‌ను అందజేస్తున్న దాత శ్రీనివాస్

కడియం: వేమగిరితోటలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి రూ.16 వేల విలువైన ఫర్నిచర్‌ను గ్రామానికి చెందిన చెల్లుబోయిన శ్రీనివాస్ వితరణ చేశారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా వస్తువులను ఆయన భార్య లక్ష్మి పేరిట ఆలయ కమిటీకి అందించారు. కార్యక్రమంలో వాసంశెట్టి నాగబాబు, జోగి చక్రవర్తి, గుత్తుల శేషగిరిరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్పెషలిస్ట్ డాక్టర్ల పోస్టుల భర్తీ

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో జిల్లాలో మిగిలిన నాలుగు స్పెషలిస్ట్ డాక్టర్ల పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు మంగళ, బుధవారాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎస్ఎన్‌సీయూ కింద పిడియాట్రీషియన్1, ఎంహెచ్ ప్రోగ్రాం కింద గైనకాలజిస్టు1, జనరల్ మెడిసిన్1, టెలీహబ్ ప్రోగ్రాం కింద జనరల్ మెడిసిన్ 1 పోస్టులకు నియమాకాలు జరుగుతాయన్నారు. ఎంపికైన వారికి కాంట్రాక్టు పద్ధతిపై నెలకు రూ.1,10,000 వేతనం ఇస్తారన్నారు. ఆసక్తి కలవారు బొమ్మూరులోని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి కార్యాలయాన్ని మంగళ, బుధవారాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం లోపు 5 గంటలలోపు సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బిక్కవోలు: బలభద్రపురం శివారుల్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అనపర్తి చెందిన సత్తి పాండురంగారెడ్డి (48) బైక్ పై బిక్కవోలు వెళ్లి తిరిగి ఇంటి వస్తుండగా బలభద్రపురం శివారు చేపల కేంద్ర వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని కాకినాడ తీసుకువెళ్లడంతో మార్గం మధ్యలో మృతి చెందినట్టు తెలిపారు.

విద్యకు ప్రాధాన్యం.. బోధన ఆధునికం

- జగన్ ప్రభుత్వం చర్యలు
- నగరంలోని 21 స్కూళ్లలో ఐఎఫ్‌టీ విధానం
- బ్లాక్‌బోర్డు, చాక్‌పీస్ లేకుండానే చదువు



ఐఎఫ్‌టీ ద్వారా బోధనపై అవగాహన కల్పిస్తున్న విషయ నిపుణులు

కంబాలచెరువు: పాఠశాల విద్యా బోధన కొత్త పుంతలు తొక్కుతోంది. కార్పొరేట్ స్కూళ్లలో లేని సదుపాయాలను సైతం ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యలో ఆధునిక టెక్నాలజీకి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రతి విద్యార్థికీ పాఠం అర్థమయ్యేలా మంచి జిజ్ఞాసను పొందేలా వనరులు సమకూర్చుతోంది. నూతన ఒరవడికి శ్రీకారం చుట్టడమే కాదు అందుకు అవసరమైన అన్నింటినీ ప్రణాళిక ప్రకారం సమకూర్చుతోంది. అందులో భాగంగా విద్యార్థులకు ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌టీ) ద్వారా సమగ్రంగా విజ్ఞానాన్ని అందించనుంది. చాక్‌పీస్, బ్లాక్ బోర్డుతో పనిలేకుండా ఐఎఫ్‌టీ విధానంతో తరగతులు జరగనున్నాయి. నగరంలో 13 మున్సిపల్ హైస్కూళ్లు, 3 యూపీ హైస్కూళ్లు, 3 ప్రభుత్వ హైస్కూళ్లలో ఐఎఫ్‌టీ ఏర్పాటు కానున్నాయి.

శిక్షణ ప్రారంభం

ఐఎఫ్‌టీ ద్వారా విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా డిజిటల్ శిక్షణ అవసరం. ఈ నేపథ్యంలో దీనిపై అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులను ఇప్పటికే ప్రారంభించారు. వీటిని ఈ నెల 15వ తేదీ వరకూ ఉపాధ్యాయులకు ఒక్కొక్క బ్యాచ్‌లో రెండు రోజుల పాటు ఇచ్చేందుకు స్థానిక విద్యాశాఖాధికారులు ప్రణాళిక రూపొందించారు. నన్నయ యూనివర్సిటీ, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, బీవీసీ, గైట్ ఇంజినీరింగ్ కళాశాలలపాటు ఐఎస్‌టీఎస్‌లు వేదికగా నిలవనున్నాయి. శిక్షణా కేంద్రంలో ఫ్యాకల్టీలుగా విషయ నిపుణులు పాల్గొని ఉపాధ్యాయులకు తర్ఫీదునిస్తారు. వీటికి జిల్లా సమగ్ర శిక్ష ప్లానింగ్ కో ఆర్డినేటర్ హాజరై అవగాహన కల్పిస్తున్నారు.

ఈ విద్యాసంవత్సరం నుంచే బోధన

ముందుగా ఉపాధ్యాయులకు డిజిటల్ విద్యాశిక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. ఐదో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఐఎఫ్‌టీ విధానంలో ఈ విద్యా సంవత్సరం నుంచే ఉపాధ్యాయులు బోధన చేయాలి. డిజిటల్ బోధన ద్వారా విద్యార్థులకు సమగ్రంగా పాఠ్యాంశాలపై అవగాహన కల్పించే వెసులుబాటు కలుగు తుంది. కాగా.. శిక్షణ కార్యక్రమాలకు రాజానగరం, రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ మండలాలకు చెందిన ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు హాజరవుతున్నారు. ఈ విధానంలో రాష్ట్ర విద్యాశాఖ ఇచ్చే మెమరీ కార్డులో పొందుపరచిన భాష, భాషేతర పాఠ్యాంశాలను బోధించే అవకాశం కలుగుతుంది. వీటికి సమన్వయకర్తలుగా సీఆర్పీలు వ్యవహరిస్తున్నారు.

ప్రైవేటు స్కూళ్లలో కూడా లేదు

ఐఎఫ్‌టీ విధానం చాలా ఖర్చుతో కూడుకున్నది. ఈ విధానం నగరంలోని ప్రైవేట్ స్కూళ్లలో కూడా ఎక్కడా లేదు. దీని ద్వారా విద్యార్థికి బ్లాక్ బోర్డుపై చాక్‌పీస్‌తో రాస్తూ పాఠం చెప్పే పని ఉండదు. దీనికి సంబంధించి ఇంజినీరింగ్ కళాశాలల సహకారం తీసుకుంటున్నాం. ఐదు నుంచి పదో తరగతి వరకు ప్రతి తరగతిలోనూ ఒక ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానెల్ ఏర్పాటు చేస్తాం.

– బి.దిలీప్ కుమార్, అర్బన్ రేంజ్ డీఐ, రాజమహేంద్రవరం

పిల్లలకు ఇచ్చే నిజమైన ఆస్తి చదువే



సాత్విక్ రెడ్డిని సత్కరిస్తున్న ప్రసాద రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే నిజమైన ఆస్తి చదువేనని సీపీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత చింతా నాగగౌరీ శంకర ప్రసాద్ రెడ్డి అన్నారు. జేఈఈ మెయిన్స్‌లో అఖిల భారత స్థాయిలో 38వ ర్యాంకు సాధించి. ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్‌లో సీటు సాధించిన వెలగల ధీరజ్ సాత్విక్ రెడ్డిని స్థానిక సీపీ రెడ్డి హీరో షోరూంలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ తరఫున సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ సాత్విక్ రెడ్డి ఇంటర్మీడియట్‌లోనూ 97.5 శాతం మార్కులు సాధించాడన్నారు. కార్యక్రమంలో బి.ధర్మారెడ్డి, మురళీకృష్ణ, స్వర్ణాంధ్ర సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు, సంజీవ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



వేమగిరి సాయిబాబా ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



గురుపౌర్ణమి వేడుకలలో పాల్గొన్న రమణమూర్తి తదితరులు

సీటీఆర్ఐ: ఆధ్యాత్మిక మార్గంలో నడిపించేవారే గురువు అని ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి అన్నారు. సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా భాషా సమితి, విద్యార్థి సంఘం సంయుక్త నిర్వహణలో వేడుకలు నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన భాషా సమితి అధ్యక్షుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ ఆదర్శప్రాయమైన జీవితానికి గురువు ఎంతో ముఖ్యమన్నారు. కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ జి.రమణ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి విద్యార్థులకు గురువు ఒక్కడే ప్రామాణికమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఏ.సరళ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు. రామకృష్ణ మఠంలో విద్యార్థులతో విష్ణు సహస్ర పారాయణ జరిగింది. సీటీఆర్ఐ జంక్షన్‌లోని దత్తసాయి ఆలయంలో బాబాకు పూజలు నిర్వహించారు.

కడియం: మండలంలోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, అర్చనలు జరిగాయి. వేమగిరి, కడియపులంక, కడియం, వీరవరం, దుళ్ల, మురమండ గ్రామాల్లో ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆయా ఆలయ కమిటీల పర్యవేక్షణలో భక్తులు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టారు. సాయంత్రం జరిగిన పల్లకీ సేవకు భక్తులు హాజరయ్యారు.

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. జ్ఞానాన్ని బోధించే గురువు ఆవశ్యకతను ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి వివరించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి, సంస్కృత శాఖాధిపతి ఆర్.రాజేశ్వరి, సంస్కృత అధ్యాపకుడు ఏవీఎస్‌డీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు. విద్యార్థినులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రాజమహేంద్రవరం రూరల్: వెంకట నగరం మెయిన్ రోడ్డు వద్ద గల సాయిబాబా మందిరంలో సోమవారం తెల్లవారుజామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు సదా శివ కుమార్ ఆధ్వర్యంలో పంచమృతాభిషేకాలు చేశారు. అనంతరం కమిటీ అధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

ఎస్వీ రంగారావు నటన ఎప్పటికీ సజీవం

- ఎంపీ భరత్ రామ్
- ఘనంగా ఎస్వీఆర్ జయంతి



గోదావరి గట్టున ఉన్న ఎస్వీ రంగారావు విగ్రహానికి నమస్కరిస్తున్న ఎంపీ భరత్ రామ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సామర్ల వెంకట రంగారావు (ఎస్వీ రంగారావు) నటన తెలుగు వారి గుండెల్లో ఎప్పటికీ సజీవమేనని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఎస్వీఆర్ జయంతిని సోమవారం ఉదయం గోదావరి గట్టున గల ఆయన విగ్రహం వద్ద ఎస్వీఆర్ కల్చరల్ అసోసియేషన్, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్, నగర చిరంజీవి యువత సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ భరత్‌రామ్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రాష్ట్ర తెలికుల గాండ్ల కార్పొరేషన్ చైర్మన్ సంకిన భవానీప్రియ, జనసేన జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్, టీడీపీ నాయకుడు యర్రా వేణుగోపాలరాయుడు, బీజేపీ అర్బన్ కోఆర్డినేటర్ యెనుముల రంగబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో 300 చిత్రాలకు పైగా ఎస్వీఆర్ నటించారన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యాపురం బ్యాంకు మాజీ చైర్మన్ చల్లా శంకరావు, పోలు విజయలక్ష్మి, వాకచర్ల కృష్ణ, బొంతా శ్రీహరి, అడబాల రామకృష్ణ, కొత్తపేట రాజా, మజ్జి అప్పారావు, నల్లం శ్రీనివాస్, మార్గాని సురేష్, ఎస్వీ శ్రీనివాస్, నక్కా శ్రీనగేష్ పాల్గొన్నారు. గోదావరిగట్టున ఉన్న ఎస్వీఆర్ విగ్రహానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చవ్వాకుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ఎస్వీఆర్‌కు నివాళులర్పిస్తున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి



పూలమాల వేస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

ధవళేశ్వరం: విలక్షణ నటుడు ఎస్వీ రంగారావు అని జనసేన పార్టీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ అన్నారు. ఎస్వీఆర్ జయంతిని జనసేన నాయకుడు యడ్ల మహేష్ ఆధ్వర్యంలో సోమవారం బ్యారేజీ సెంటర్‌లో నిర్వహించారు.

ధవళేశ్వరం బ్యారేజ్ సెంటర్‌లోని ఎస్వీ రంగారావు విగ్రహం వద్ద జరిగిన జయంతి వేడుకల్లో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ పాల్గొన్నారు.

దేశంలో బీజేపీ సుపరిపాలన



ధవళేశ్వరంలో పర్యటిస్తున్న బొమ్ముల దత్తు తదితరులు

ధవళేశ్వరం: బీజేపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశంలో సుపరిపాలన అందిస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అన్నారు. మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పన్నాల లక్ష్మీసంతోషి ఆధ్వర్యంలో సోమవారం ధవళేశ్వరం ఎంప్లాయీస్ కాలనీలో గృహ సంపర్క్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బొమ్ముల దత్తు ముఖ్య అతిథిగా విచ్చేసి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎస్‌వీబీఎస్ ఆచారి, రూరల్ మండల ఇన్‌చార్జి కాలెపు సత్యసాయిరాం, అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, కోకన్వీనర్ యానాపు ఏసు, జిల్లా ప్రధాన కారదర్శి గుర్రాల వెంకట్రావు పాల్గొన్నారు.


స్వరూప్ నగర్‌లో చోరీ

రాజమహేంద్రవరం రూరల్: లాలాచెరువు స్వరూప్ నగర్‌కు చెందిన అయినవిల్లి నేస్తాలుకు దానవాయిపేటలో ఫొటోస్టూడియో ఉంది. ఆయన భార్య అపోలో‌లో పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం పిల్లలను స్కూలుకు పంపేసిన తర్వాత భార్యాభర్తలిద్దరూ ఇంటికి తాళం వేసుకుని విధులకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం నేస్తాలు భోజనానికి ఇంటికి వచ్చేసరికీ తలుపు తాళం పగలగొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూడగా బీరువాలోని రెండున్నర కాసుల బంగారు వస్తువులు, 30 తులాల వెండి వస్తువులు, రూ.23 వేలు అదృశ్యమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాకంబరీ.. నమోస్తుతే..



కూరగాయల అలంకరణలో అక్కమ్మ తల్లి



శాకంబరిగా ఉమాపార్వతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రైల్వేస్టేషన్ సైకిల్‌స్టాండ్ ఆవరణలో వెలసిన పాత కన్నమ్మతల్లి ఆలయంలో అక్కమ్మ తల్లిని గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం శాకంబరీదేవిగా అలంకరించారు. ప్రైవేటు స్కూల్ టీచర్ కామాందుల శ్రీతులసి సుమారు రూ.30 వేల విలువైన వివిధ రకాల కూరగాయలతో ఆలయాన్ని, అమ్మవారిని అలంకరించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ నిర్వాహకుడు ఏడాకుల వెంకటేశ్వరరావు తెలిపారు. అలాగే స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న కన్నమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు.

శాకంబరిగా ఉమాపార్వతి

సీటీఆర్ఐ: గోదావరి గట్టున గల ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో ఉమా పార్వతి అమ్మవారు సోమవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని మహిళా భక్తులు వివిధ కూరగాయలతో అలంకరించారు. ఈ సందర్భంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగిని అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: రైల్వే ఉద్యోగిని, తన తమ్ముడి కుమార్తె అయిన 33 ఏళ్ల కర్రి ఝాన్సీ గత నెల ఒకటో తేదీ నుంచి కనిపించడం లేదని బొమ్మూరు నవభారత్ నగర్‌కు చెందిన కర్రి చినబాబూరావు సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఝాన్సీకి తండ్రి చనిపోవడంతో రైల్వేలో ఉద్యోగం వచ్చింది. రెండున్నరేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నప్పటికీ భర్తతో విడిపోయి నవభారత్ నగర్‌లో పెదనాన్నతో కలిసి ఉంటోంది. ఈ నేపథ్యంలో గత నెల ఒకటో తేదీన ఇంటి నుంచి వెళ్లిన ఆమె ఇప్పటి వరకూ తిరిగి రాలేదు. ఈ మేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దంచికొట్టిన వాన



నీటమునిగిన హైటెక్ బస్సు షెల్టర్

రాజమహేంద్రవరం సిటీ: భానుడి విశ్వరూపంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సోమవారం సాయంత్రం ఉపశమనం లభించింది. ఉదయం నుంచి ఎండ మండిపోగా, సాయంత్రం భారీ వర్షం కురిసింది. నగరంలోని పలు ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి.



కృష్ణానగర్ రోడ్డులో నీరు

లింగవివక్షను రూపుమాపేందుకు కృషి

కంబాలచెరువు: లింగనిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఆ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీవల్లి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎంసీహెచ్ బ్లాక్‌లో మిడ్ లెవిల్ హెల్త్ ప్రొవైడర్లుకు సోమవారం లింగనిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవల్లి మాట్లాడుతూ లింగ వివక్ష, అసమానతలను తొలగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో జరిగే సమావేశాల్లో పీసీపీఎన్డీటీ యాక్టుపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో ఎక్కువ అబార్షన్లు జరగడం, ముందు ఆడబిడ్డ పుట్టి రెండోకాన్పు అబార్షన్ అయిన వాటిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంఒలు డేవిడ్, శివకుమార్, హెచ్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

గణితంపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజశేఖర్

రాజానగరం: అన్ని శాస్త్రాలకు మూలమైన గణితంపై పట్టు సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఖరగ్‌పూర్) ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్టుమెంట్ ఆఫ్ మ్యాథ్‌మెటిక్స్ ఆధ్వర్యంలో సోమవారం గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. ఈ సందర్భంగా మ్యాథ్‌మేటికల్ మోడలింగ్ ఇన్ రియల్ లైఫ్ ప్రోబ్లమ్స్ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులను చైతన్యపరిచారు. వైద్య శాస్త్రంలోని వివిధ సమస్యలను గణిత శాస్త్ర నిపుణతతో ఏవిధంగా పరిష్కరించవచ్చునో ఉదాహరణలతో వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయ నిర్మల, ఆచార్య ఆర్.డేవిడ్

స్థలం కబ్జా కేసులో ముగ్గురి అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు, చిత్రంలో సీఐ కాశీవిశ్వనాథ్, ఎస్సై సుధాకర్

రాజానగరం: జాతీయ రహదారిని ఆనుకుని స్థానిక జీపీఆర్ లేఅవుట్‌లో కబ్జాకు గురై, చేతులు మారిన ఒక ప్లాట్‌కు సంబంధించిన కేసులో రాజమహేంద్రవరానికి చెందిన తానేపల్లి వెంకట రామకృష్ణ, నెట్ల కల్యాణ్ కుమార్, రౌతు రమేష్ నాయుడును పోలీసులు అరెస్టు చేశారు. నార్త్‌జోన్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం పందువకు చెందిన వేగేశ్న వెంకటరంగ అచ్యుత సత్యనారాయణరాజు స్థానిక జీపీఆర్ లేఅవుట్‌లో సర్వే నంబర్ 471/1లో 402 గజాల స్థలాన్ని కొన్నేళ్ల క్రితం కొనుగోలు చేసి ఖాళీగా వదిలేశాడు. ఇటీవల తమ గ్రామంలోని సచివాలయంలో ఈసీ చూస్తే ఆ స్థలం వేరొకరి పేరు మీద ఉన్నట్టు తెలిసింది. దీంతో వెంటనే రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు దిమ్మతిరిగే విషయాలు తెలిశాయి. స్థలం అసలు యజమాని అయిన సత్యనారాయణరాజు చనిపోయినట్టుగా డెత్ సర్టిఫికెట్ సృష్టించిన నేరగాళ్లు, స్థలానికి కూడా తప్పుడు పత్రాలు తయారు చేశారు. రూ.60 లక్షలు విలువ చేసే ఆ స్థలాన్ని రూ. 40 లక్షలకే వేరొకరికి అమ్మేశారు. నిందితులందరూ రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించినవారే. సమావేశంలో సీఐ కాశీవిశ్వనాథ్, ఎస్సై సుధాకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి మోదకొండమ్మ జాతర

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామదేవత మాతృశ్రీ మోదకొండమ్మ జాతర మంగళవారం నుంచి ఈనెల 11వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. శ్రీరంగపట్నానికి చెందిన కళాకారుల బృందాలే వీటిని నిర్వహిస్తాయి. ఉత్సవాలు ప్రారంభం రోజైన మంగళవారం గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు.